పంటపొలాల్లోకి మురుగునీరు

- గోపరపల్లెలో రోడ్లపై నిలవడంతో ఇబ్బందుల్లో ప్రయాణికులు
- రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్



పంట పొలాల్లోకి వస్తున్న మురికినీరు చూపిస్తున్న రైతు (ఫైల్)

ఓదెల: మండలంలోని గోపరపల్లెలో మురుగు కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ లేనందున మురికి నీరు పొలాల్లోకి వెళ్లడంతో రైతులు తిప్పలు పడుతున్నారు. అదేవిధంగా ప్రధానరోడ్లపై నిలిచి ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామపంచాయతీ నిధులు లేకపోడంతో గ్రామంలో మురుగు కాలువలు నిర్మించలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. చెత్తచెదారం, వ్యర్థ పదార్థాలు పంటపొలాల్లో మేటలు వేస్తున్నాయి. దీంతో రైతులు పంటపొలాల సాగుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం పాలకవర్గం లేనందున స్పెషల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సమాజ సేవతోనే గుర్తింపు



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జ్యోతినగర్: సమాజ సేవతోనే గుర్తింపు లభిస్తుందని లయన్స్ క్లబ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహరాజు కోదండరాం అన్నారు. ఎన్టీపీసీ రామగుండం లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది, జీడీకే ఉమెన్ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా సమాజ సేవ చేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది అధ్యక్షుడిగా చింతపల్లి కిషన్‌రావు, కార్యదర్శిగా బండారి శ్రీనివాస్, కోశాధికారిగా వొల్లాల సురేశ్, జీడీకే ఉమెన్ కమిటీ అధ్యక్షురాలిగా బాలసాని పద్మగౌడ్, కార్యదర్శిగా ఏలేశ్వరం శ్రీలత, కోశాధికారిగా కంకనాల శ్రీదేవి రెడ్డిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. రీజియన్ చైర్‌పర్సన్ సంపత్‌రావు, శ్రీనివాసరావు, ఆనంద్, వినోద్, చంద్రమౌళి, ముకుందరెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన జరగుతుందని ఎంపీడీవో తిరుపతి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, సంబంధిత శాఖాధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

అసత్యపు ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న కిషన్, సురేశ్

మంథని: మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబంపై జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కాటారం సింగిల్‌విండో చైర్మన్ చల్లా నారాయణరెడ్డి చేస్తున్న అసత్యపు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్, జిల్లా కార్యదర్శి మంథని సురేశ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎంత అవినీతి జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. నాయకులు రవితేజగౌడ్, పర్సవేన మోహన్, బండారి ప్రసాద్, టి.రాజు, సాదుల శ్రీకాంత్, సందీప్‌గౌడ్, కందుకూరి రామ్మూర్తి ఉన్నారు.

ఘనంగా మడేలయ్య ఉత్సవాలు



ఓదెల: మండలంలోని కొలనూర్‌లో రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్య ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. బోనాలతో మడేలయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్, రజకసంఘం రాష్ట్ర నాయకుడు కొల్లూరి కుమార్, కులపెద్దలు కొల్లూరి శంకరయ్య, గోపాల్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తిలో ఎస్సై జి.అశోక్‌రెడ్డి, ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో వాహనాలను గురువారం తనిఖీ చేశారు. కనగర్తి గ్రామం మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేని వాహనాలకు జరిమానా విధించారు.

గ్రామాల్లో సోషల్ ఆడిటింగ్ గ్రామసభలు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లి, జయ్యారం గ్రామాల్లో గురువారం ఎంపీడీవో శశికళ ఆధ్వర్యంలో మూడోరౌండ్ సోషల్ ఆడిటింగ్ గ్రామసభలు నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీలో జరిగిన పనులు, తీర్మానాలు, ఖర్చుల రికార్డులను తనిఖీ చేశారు. ఈజీఎస్ అంబుడ్స్‌మన్ శరత్, పంచాయతీ కార్యదర్శి పిడుగు రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె.. సమస్యలపై సానుకూల స్పందన



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పెంద్రు రమ, కమిషనర్ మల్లికార్జున స్వామి

మంథని: తమ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు విధులకు దూరంగా ఉండి కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, కమిషనర్ గుట్టల మల్లికార్జున్, మున్సిపల్ కార్మికులు, ప్రజా సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. ఆరేళ్లుగా సబ్బులు, నూనె, దుస్తులు, కూలీ డబ్బులు ఇవ్వడం లేదని, మూడు నెలలుగా ఏరియల్స్ రావడం లేదని పేర్కొన్నారు. ఆరు నెలలకు సంబంధించి సబ్బులు, నూనెలు, దుస్తులు, ఇతర వస్తువులు నాలుగు రోజుల్లో కార్మికులకు అందిస్తామని, ఏరియర్స్ చెల్లిస్తామని, సమస్యలన్నీ రెండు నెలల్లో పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటస్వామి, బూడిద గణేశ్, సందీప్ ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించేలా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కలెక్టర్ శ్రీహర్షకు కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్‌ను గురువారం పెద్దపల్లిలో కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎస్సారెస్పీ డి–86, డి–83 కాలువల ద్వారా చివరి భూముల రైతాంగానికి సాగునీరు అందేలా శాశ్వత పరిష్కారం కోసం ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ ఎస్‌కేఎల్ ద్వారా పెద్దాపురం చెరువులోకి, అక్కడి నుంచి హుస్సేన్‌మియా వాగులోకి నీటిని విడుదల చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ దూపం సంపత్‌కుమార్, మాజీ సర్పంచు ఆడెపు రాజు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం ఉన్నారు.

‘ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి’

రామగుండం: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫీజులు వసూలు చేస్తున్నాయని టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్స్, ఎంప్లాయిస్, రిటైర్డ్ ఎంప్లాయిస్ సన్స్ అండ్ డిపెండెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్‌బాబు గురువారం జిల్లా విద్యాధికారి మాధవికి ఫిర్యాదు చేశారు. డొనేషన్లు, పుస్తకాలు, టీసీ ఇవ్వడానికి, స్పెషల్ క్లాసుల పేరిట అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్పందించిన డీఈవో ఆరోపణలు వచ్చిన పలు స్కూళ్లపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపడతానని పేర్కొన్నారు. నిజాం, నిస్సార్, తౌఫిక్, రజాఖ్, రమేశ్‌గౌడ్ ఉన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

రామగుండం: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఖరీఫ్–2024 కనీస మద్దతు ధరలు అంతగా ఆశాజనకంగా లేవని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మేర్గు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్ అన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం అంతర్గాం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు అందజేశారు. మద్దతు ధర ప్రకటించిన పెసరకు కేవలం 1.4%, చాలా పంటలకు గరిష్ఠంగా 7శాతం పెంచారని, ఇప్పటికీ ప్రకటించిన మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించకపోవడంతో అమలుకు నోచుకోవడం లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను సత్వరమే అమలు చేయాలని, రైతు రుణమాఫీని సత్వరమే పూర్తి చేయాలని కోరారు. దళితులు, పేద రైతులు, భూమిలేని కౌలు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఐ.కృష్ణ, తమ్మనవేని రాజకొమురయ్య, పైడిపల్లి రమేశ్, బొడ్డుపల్లి రామస్వామి, ఆలకుంట దేవయ్య, పోలారం రాజు, సాయి ఉన్నారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: మోదీ అనుసరిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. యైటింక్లయిన్‌కాలనీలో గురువారం ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రంలో పదేళ్ల నుంచి 50ఏళ్ల నాటి ఎమర్జెన్సీ తలపించేలా పాలన కొనసాగుతోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి అన్ని ప్రజా కార్మిక సంఘాల నాయకులు కలిసి రావాలని కోరారు. డివిజన్ కార్యదర్శి రాజేందర్, నాయకులు స్వామి, నాగభూషణం, దేవయ్య, మనోజ్, రాజు, ప్రసాద్, అవినాష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని సింగరేణి ప్రభావిత గ్రామమైన లింగాపూర్‌లో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ గురువారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి కార్యదర్శి మానసకు వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా గ్రామంలో తాగునీటి సమస్య లేకపోగా ఇటీవల కాలంలో ఎన్టీపీసీ మోటార్ల పంపింగ్ సామర్థ్యం తగ్గించడంతో తమకు తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. కాగా అదే లైనులో జెన్‌కోకు చెందిన పైపులైన్ ఉందని దాని ద్వారా తాగునీటి సరఫరాకు అధికారులను సంప్రదించాలని కోరారు.

పీఎం కిసాన్‌కు రైతులు కేవైసీ చేసుకోవాలి

రామగిరి: రైతులు పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. సెంటనరీకాలనీ పోస్టాఫీస్ వద్ద పీఎం కిసాన్ అందని లబ్ధిదారులకు గురువారం గోదావరిఖని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌తో కలిసి పోస్టాఫీస్ నూతన ఖాతాలను ప్రారంభించి ఈకేవైసీ, ఎన్‌పీసీఐలతో జత చేశారు. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింకు లేని ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలను నిలిపివేసిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు పోస్టాఫీస్ నూతన ఖాతా ద్వారా ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింకు చేయడం ద్వారా పీఎం కిసాన్ డబ్బులు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. సెంటనరీకాలనీ పోస్టాఫీస్ మేనేజర్ రమణారెడ్డి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మౌనిక, అరవింద్, నవీన్ పాల్గొన్నారు.

బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్: ప్రతి ఏడాది బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లు బీసీలకు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ బిల్లు పాస్ చేయాలన్నారు. బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, రాజేశ్, అభిషేక్ పాల్గొన్నారు.

మంథని అభివృద్ధికి కృషిచేస్తున్న శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: ఎన్నికల్లో మంథని నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

వ్యభిచార ముఠా అరెస్ట్

గోదావరిఖని: స్థానిక అశోక్‌నగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేసి ఇద్దరు నిర్వాహకులు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రామగిరి: సెంటినరీకాలనీ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై పన్నూర్ క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పన్నూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని సెంటినరీకాలనీకి చెందిన బానోతు రాజు వెనుక నుంచి ఢీకొనడంతో రాజు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా పెద్దపల్లి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. రాజు రెండురోజుల క్రితం సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందారు.

మరో ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు

రామగిరి: మండలంలోని నాగేపల్లి–బేగంపేట ప్రధాన రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని నవాబ్‌పేట గ్రామానికి చెందిన సిద్ద నవీన్, మంథని మండలం రచ్చపల్లికి చెందిన సాధుల శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సింగరేణి కార్మికుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: టూ ఇంక్లయిన్ నుంచి 11 ఇంక్లయిన్ మైన్‌కు వెళ్లే రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రమల్లన్న అనే సింగరేణి కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం చంద్రమల్లన్న తెల్లవారుజామున బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా 11 ఇంక్లయిన్ రోడ్డుపై గేదెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రిఫర్ చేశారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

ముత్తారం: మండలంలోని మైదంబండకు చెందిన సిగవేన అజయ్ గురువారం బైక్‌పై వెళ్తూ కేశనపల్లి వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తల, కాలుకు బలమైన గాయాలయ్యాయి. ప్రమాద ఘటనను చూసిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ వెంటనే పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం ఆస్పత్రికి తరలించారు.

ఎంపిక పోటీలు

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాల ఎంపికకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు లక్ష్మన్, పీడీ సురేశ్, నరేశ్, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో..

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం రామగుండం మండలంలోని విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి ప్రవేశాలకు ఎంపిక పోటీలను రామగుండం ఎంఈవో రాజయ్య ప్రారంభించారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టండి

యైటింక్లయిన్‌కాలనీ: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల దోపిడీని విద్యాధికారులు అరికట్టాలని టీఎస్ఎస్ఎఫ్ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజిద్ కోరారు. పాఠశాలల్లో తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఎఫ్ నాయకులు సతీశ్, రాము, అజయ్, రాజేశ్, వెంకటేశ్ డిమాండ్ చేశారు.

విద్యార్థులకు షీ టీంపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక కృష్ణవేణి పాఠశాలలోని విద్యార్థులకు పెద్దపల్లి జిల్లా షీ టీం పోలీస్ బృందం గురువారం షీ టీంపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు గురైతే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందిచండంతో పాటు షీటీం వాట్సాప్ నంబర్ 63039 23700కు లొకేషన్ పంపించాలని సూచించారు. సైబర్ క్రైమ్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. షీటీం పోలీసులు సురేశ్, స్నేహలత, భరోసా బృందం విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేయాలి

మంథని: మంథని ప్రధాన చౌరస్తాలోని జూనియర్ కళాశాల దారిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని విద్యార్థి జేఏసీ నాయకుడు బెజ్జంకి డిగంబర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమాదేవికి వినతిపత్రం అందించారు. విద్యార్థులతో పాటు అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు.

లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలి



షెడ్‌ను ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని/రామగిరి: రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులుగా ముందుకు సాగాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు పేర్కొన్నారు. ఓసీపీ–3 సీహెచ్‌పీలో రూ.47.31లక్షలతో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్‌షెడ్, ఎంఎస్ఎస్ ప్లాంట్‌లో రూ.6.60లక్షలతో నిర్మించిన సైకిల్‌షెడ్, రూ.2.50లక్షలతో నిర్మించిన క్వాలిటీ ల్యాబ్‌ను గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి ఎప్పుడూ వెనకాడబోదన్నారు. ఉద్యోగుల వసతులకు నిర్మించిన షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్రారెడ్డి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ, ప్రాజెక్ట్ అధికారులు ఎస్.రాధాకృష్ణ, ఎన్.రమేశ్, వైవీ శేఖర్‌బాబు, కాశీవిశ్వేశ్వరరావు, పద్మరాజు, ముప్పిడి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి సంస్థలో ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. రెస్క్యూ జీఎంగా విధులు నిర్వహిస్తున్న ఎస్.వెంకటేశ్వర్లు 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఫైనాన్స్ ఏజీఎం పీ.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారులు ఎన్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఎన్.రమేశ్, ఏరియా సేఫ్టీ అధికారి సీ.హెచ్.వెంకరమణ, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఏపీఏ గనిలో..

ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిలో గురువారం రెస్క్యూ జీఎం ఎస్.వెంకటేశ్వర్లును ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, అధికారులు సన్మానించారు. ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ టి.రఘురాం, అధికారులు కె.జనార్దన్, కె.మాధవరావు, వీపీజే వెంకటేశ్, ఎం.రమేశ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి



సన్మానిస్తున్న ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు

రామగిరి: విధి నిర్వహణలో చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆర్జీ–3 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో 30న ఉద్యోగ విరమణ పొందనున్న సివిల్ డీజీఎం పద్మరాజును ఏపీఏ జీఎం సన్మానించారు. సింగరేణి సంస్థలో పద్మరాజు చేసిన సేవలు అందరికీ ఆదర్శమని కొనియాడారు. ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, పర్చేస్ డీజీఎం పీ.డీ.సుధాకర్, అధికారులు రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరారు. కోల్‌కత్తాలోని కోలిండియా ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన జేసీసీ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ప్రమాదాలను నివారించడానికి మైనింగ్ ప్రాంతంలో భద్రతా చర్యలు అమలు చేయాలన్నారు. ఓసీపీల్లో తేలికపాటి, భారీ వాహనాలకు వేర్వేరుగా రోడ్లు వేయాలన్నారు. పర్యవేక్షక సిబ్బంది పదోన్నతికి సంబంధించిన విధానాన్ని ఏరియా స్థాయిలో కాకుండా కంపెనీ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. అయోధ్య, వారణాసి, తిరుపతి, కన్యాకుమారి మొదలైన ధార్మిక ప్రదేశాలలో కొత్త హాలిడే హోమ్‌లను తెరవాలని కోరినట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు.

కనుల పండువగా పెద్దమ్మతల్లి బోనాలు

జూలపల్లి: మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తుల కులదైవం పెద్దమ్మతల్లికి బోనాల పండుగను కనుల పండువగా నిర్వహించారు. స్థానిక ఆలయంలో పెద్దమ్మతల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. బోనాల ఉత్సవంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, నల్ల స్వచ్ఛంద సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు చెల్లించారు. నాయకులు లోక జల్పతిరెడ్డి, పొట్టాల శంకర్, కూసి రాజయ్య, నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూసాలలో..

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఇంటింటా మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. వేడుకల్లో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, కార్యదర్శి కంకణాల సతీశ్, వార్డు కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, డైరెక్టర్లు లక్ష్మ య్య, కనకయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రవి, మాజీ ఎంపీటీసీ ఆశాలు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం మాజీ ప్రెసిడెంట్ రవి, సిద్ధ తిరుపతి, పురం రమణ, గుర్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

పెద్దపల్లిరూరల్: బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై లక్ష్మణ్‌రావు అన్నారు. పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో గల థియేటర్ వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఓ యువకుడికి ప్రజల ముందే బుద్ధి చెప్పి కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించొద్దని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా లింగయ్య

కమాన్‌పూర్: కమాన్‌పూర్ గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడిగా గెల్లు లింగయ్యను ఎన్నుకున్నారు. గ్రామంలోని యాదవ సంఘ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో లింగయ్యను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.